## క్లుప్తంగా

### సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన చెక్కులను బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలో లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని కాపువాడకు చెందిన అర్జున్‌కు రూ.30వేల చెక్ అందించారు. కౌన్సిలర్ పిరిసింగుల జైచందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కౌటాల: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపు ఉదయం 10 గంటలకు సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేతుల మీదుగా 47 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఓల్డ్ కాలనీలో గల శ్రీ ఉమామహేశ్వర మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సేవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శోభకృత నామ ఉగాది నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు పరికిపండ్ల కరుణాకర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. పద్మశాలి సేవా సంఘం పదాధికారులు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

### తలసేమియా వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

రెబ్బెన: మండలంలోని పాశిగాం గ్రామానికి చెందిన తులసీరాం – సంధ్యల 11నెలల చిన్నారి స్పందన తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా స్పందించిన గ్రామ యువకులు ఆర్థిక సాయం అందజేశారు. చిన్నారి వైద్య ఖర్చులకు రూ. 20లక్షలు అవసరం కాగా యువకులు విరాళాలు సేకరించి బుధవారం రూ.32,300లను సర్పంచ్ మోర్లె శ్రీనివాస్ చేతుల మీదుగా చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.

### మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: కెరమెరి మండలానికి చెందిన ఆదివాసీ యువతి రేణుక మృతికి కారణమైన రమేష్‌ను కఠినంగా శిక్షించాలని ఆదివాసీసేన మండల అధ్యక్షుడు సీడం కైలాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసి, మృతికి కారణమైన రమేష్‌ను వెంటనే శిక్షించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జంగు, రామచందర్, రాము, ఆనంద్, శంకర్ తదితరులు ఉన్నారు.

### జర్నలిస్టుల ధర్నా విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మీడియాపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ, షహీద్ భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు నేడు కలెక్టరేట్ ఎదుట ఉదయం 11 గంటలకు నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



దహెగాంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు



పెంచికల్‌పేట్: ఎల్కపల్లి ఆలయంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న అర్చకుడు



శివసంకల్ప మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

# ఊరూరా ఉగాది వేడుకలు



కెరమెరి: పంచాంగం చదువుతున్న పురోహితుడు



ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ ఆధ్వర్యంలో..



ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ సంఘం ఆధ్వర్యంలో..



కౌటాల: ఉగాది పచ్చడి అందిస్తున్న అర్చకుడు



రాస్పల్లిలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మహిళ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శోభకృతనామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని ఉదయం మార్కెట్ కొనుగోలు దారులతో సందడిగా మారింది. జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ వద్ద మామిడి ఆకులు, మామిడి కాయలతో పాటు ఉగాది సామగ్రి కొనుగోలు చేశారు. ఇంటి ముంగిళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. కొత్త బట్టలు ధరించి ఆలయాలను దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయం, శివకేశవ మందిర్‌తో పాటు శిర్డీ సాయి మందిరంలో అర్చకులు ఇందారపు మధూకర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. పల్లెల్లో రైతులు వ్యవసాయ పనిముట్లు, ఎడ్లకు ప్రత్యేక పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు.

ఆసిఫాబాద్‌అర్బన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలో ఇళ్ల ముందు మామిడి తోరణాలతో అలంకరించి ముస్తాబు చేశారు. బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర నాయకురాలు సిద్దంశెట్టి సుహాసిని ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. నాయకులు విజయ్, సతీష్‌బాబు, విశాల్, సత్యనారాయణ, శ్రీనివాస్, గణేష్, పాల్గొన్నారు.

**బీసీ సంఘం ఆధ్వర్యంలో...**

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. నాయకులు ప్రణయ్, పటేల్, సంజయ్ పాల్గొన్నారు.

**ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో...**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శిశు మందిర్ పాఠశాల ఆవరణలో ఉగాది నిర్వహించారు. గుండేటి కోటేష్, మధునయ్య, మధుకర్, సంతోష్, వేణుగోపాల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్‌లో..**

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లో బుధవారం శ్రీ శోభకృత్ నామ ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. మధుకర్, రాజేష్ రావు, శ్యామ్ సుందర్, సుధాకర్, రవీందర్ పాల్గొన్నారు.

**శివమల్లన్న ఆలయంలో..**

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు శివమల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.



జిల్లా కేంద్రంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకుడు మధూకర శర్మ

**దహెగాంలో..**

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో ఉగాది పచ్చడి చేసుకొని ఆరగించారు. దేవాలయాల్లో పంచాగ శ్రవణం నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో జరిగిన పంచాగ శ్రవణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

**పెంచికల్‌పేట్‌లో..**

పెంచికల్‌పేట్: శ్రీ శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. తెలుగు పండగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఎల్కపల్లి హనుమాన్ ఆలయంలో ఆలయ పూజారి విష్ణుచారి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

**కెరమెరిలో..**

కెరమెరి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని శివాలయంలో భక్తులు ఆంజనేయునికి, శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు కులకర్ణీ బాపూదేవ్ భక్తులకు పంచాంగ శ్రవణం చేశారు.

ఉగాదిని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పొలం పనులకు శ్రీకారం చుట్టారు. ఉదయం తమ ఇళ్లల్లో పూజలు చేసిన అనంతరం పొలాల్లోకి వెళ్లి ఎడ్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భూమాతకు మొక్కుకుని పొలంలో ఉన్న చెత్తాచెదారం ఏరడంతో పాటు అరకలు దున్నడం ప్రారంభించారు.

**సిర్పూర్ (టి)లో..**

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయం, శివాలయం, రాచర్ల హనుమాన్ ఆలయం, రామాలయం, మండలంలోని టోంకిని గ్రామంలోని శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం, లోనవెల్లిలోని రామాలయం, భూపాలపట్నం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**భక్తిశ్రద్ధలతో శివసంకల్ప మహాయజ్ఞం**

మండలంలోని చీలపెల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం ప్రాంగణంలో బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామస్తులు 25 కుండీల శివసంకల్ప మహాయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మహాయజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు న్విహించారు. శివసంకల్ప మహాయజ్ఞం నిర్వాహకుడు అశోక్ ఆర్యా, బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని ప్రజలు బుధవారం తెలుగు సంవత్సరాది ఉగాదిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్త సంవత్సరానికి నాంది పలుకుతూ రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. మండల కేంద్రంలోని కోదండ రామాలయంతో పాటు గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వర స్వామి, నంబాల శివాలయం, ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

**జీఎం కార్యాలయంలో..**

గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బుధవారం ఉగాదిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జీఎం దేవేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది సందర్భంగా తయారు చేసిన పచ్చడిని కార్యాలయ ఉద్యోగులకు పంపిణీ చేశారు.

**కౌటాలలో..**

కౌటాల: మండలంలోని ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఉగాది జరుపుకున్నారు. మండల కేంద్రంలోని కంకలమ్మ కేతేశ్వర స్వామి ఆలయం, శివాలయం, కోదండ రామాలయం, గురుడుపేటలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గుండాయిపేటలో నరేంద్రబాబా పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు శంకరయ్య, సంతోష్, విష్ణుష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గట్టయ్య, సభ్యులు తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, భీమన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

**బెజ్జూర్‌లో..**

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ పనులను ప్రారంభించారు.



కెరమెరిలో నైవేద్యంతో పొలానికి వెళ్తున్న మహిళలు



కాగజ్‌నగర్‌రూరల్: పంచాంగ శ్రవణం చేస్తున్న నరహరిశర్మ



రెబ్బెన: కోదండ రామాలయంలో భక్తుల పూజలు



కాగజ్‌నగర్‌టౌన్: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పీఆర్టీయూ నేతలు



కాగజ్‌నగర్‌రూరల్: పచ్చడి, బొప్పట్లతో మహిళ



కౌటాల: గుండాయిపేటలో పల్లకి ఊరేగింపు



కాగజ్‌నగర్‌రూరల్: శివమల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



రెబ్బెన: కనకదుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## గ్రామాలు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలి



పెట్రోల్ పంపు ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారావు

కౌటాల: గ్రామాలు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో రిధిమా సర్కార్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపును ఆయన బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్, నాయకులు మధుకర్, ప్రకాష్, నాహీం, సత్యనారాయణ, విలాస్‌గౌడ్, రాజేశ్వర్, మహేష్, నిర్వాహకులు సుజీత్ సర్కార్, నారాయణ సర్కార్, సంజయ్ సర్కార్, విలాస్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

**చలివేంద్రం ప్రారంభం**

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం చౌరస్తాలో బుధవారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు చలివేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవాసవి ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఎంపీటీసీ కుమార్, సర్పంచ్ మల్లేశ్, వ్యాపారులు శ్రీనివాస్, శివప్రసాద్ పాల్గొన్నారు.

## జన చైతన్యయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

రెబ్బెన: మండల కేంద్రంలో బుధవారం సీపీఐ(ఎం) జన చైతన్యయాత్ర వాల్ పోస్టర్లను సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఎం మండల నాయకులు చాపిడి పురుషోత్తం మాట్లాడుతూ సీపీఐ(ఎం) జాతీయ నాయకత్వం పిలుపు మేరకు గురువారం నుంచి ఈనెల 29 వరకు తెలంగాణలో జన చైతన్యయాత్రలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, మేధావులు జన చైతన్యయాత్రల్లో భాగస్వాములు కావాలని కోరారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని, సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం యువకులు పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చాపిడి శివ, ప్రశాంత్, క్రిష్ణ, రఘు, తిరుపతి పాల్గొన్నారు.



రెబ్బెనలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

## ఆనవాళ్లు కోల్పోయిన నిర్మాణాలు



గతేడాది నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు



ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోయిన సెగ్రిగేషన్‌షెడ్డు

అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుచూపు లేకుండా పల్లెప్రగతి పనులు చేపట్టారనడానికి ఈ దృశ్యాలు నిదర్శనం. పల్లెప్రగతిలో భాగంగా ఒక్కో గ్రామపంచాయతీకి రూ. 12.50 లక్షలతో పల్లెప్రగతి పార్కు, సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామాలను ప్రభుత్వం నిర్మించింది. మండలంలోని భట్‌పల్లి గ్రామపంచాయతీలో పెద్దవాగును ఆనుకుని పల్లెప్రగతి పార్కు, సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామం నిర్మించారు. గతేదాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో పల్లెప్రగతి పార్కు, సెగ్రిగేషన్ షెడ్డు కొట్టుకుపోయాయి. దీంతో లక్షల రూపాయల ప్రజా ధనం వృథా అయ్యింది.

– కాగజ్‌నగర్‌రూరల్



గతేడాది నిర్మించిన పల్లెప్రగతి పార్కు



కొట్టుకుపోయిన పల్లెప్రగతి పార్కు

## కేజీబీవీ విద్యార్థులకు ఆటల పోటీలు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల కస్తూరిబా విద్యాలయంలో బుధవారం భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు ఉమెన్స్ జిల్లా కమిటీ కన్వీనర్ శ్రావణి తెలిపారు. విద్యార్థులకు రన్నింగ్‌తో పాటు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించగా విద్యార్థినులు పాల్గొన్నారు. శ్రావణి మాట్లాడుతూ ప్రభుత్వం యువకులకు క్రీడల్లో ప్రాధాన్యత కల్పించి ప్రోత్సాహం అందించాలన్నారు.